ఆమె అతనితో ఈ ప్రస్తావనే తేలేదు ఆమె ఏమాత్రం సూచనచేసినా అతను స్పష్టంగా తన హృదయం విప్పేసేవాడే. అయితే ఆమె లేత చింతకాయలు ఉప్పద్దుకుని తింటూనే కూర్చుంది. పెళ్ళినాడుకూడా ఏదో అవాంతరం వచ్చి పెళ్ళి ఆగిపోతుందని అతను ఆశించాడు. ఆ నాటిరాత్రి అతనికి రకరకాల కలలొచ్చాయి. అన్నీ పెళ్ళి ఆగిపోడాన్ని గురించే.

రమని తనుపెళ్ళాడి ఉంటే ?— అతని మనస్సు నవ్వింది. అప్పుడొక రాతబల్లదగ్గర కూర్చుని, ఆమె భర్తలాగే అతనూ వడ్డీవ్యాపారం చేస్తూండును నలుగు రయిదుగురు పిల్లల్ని కని ఉండును వెనక సీట్లో కూచుని రమతో వెర్రి వేళాకోళాలాడుతుండును. అప్పుడు లోకానికి ప్రజ్ఞాపారమిత ఎవరందిస్తారు? ఇంతటి శిష్యబృందానికి ఆచార్యత్వం ఎవరు వహిస్తారు? కళ, కళాతపస్వి జీవితాన్ని బలిగొంటుంది. తను నటించి అతను లోకానికి అనశ్వరమయిన ఆనందాన్ని ప్రసాదిస్తాడు వెయ్యిమంది రమలుకలిసినా ఒక్కకావ్యానికి సరిరారు.

కళ నశిస్తే ఏం? లోకమంతా రమలతో నిండిపోతే ఇంక కళ ఎందుకు? జీవితం గొప్పదా? కళ గొప్పదా? సందేహం ఏముంది జీవితమే కళంతా ఈ సత్యాన్నేగా నిరూపించేది అయితే కళకోసం జీవితాన్ని ధ్వంసం చేసుకోడం ఎంత వెర్రితనం ఎంత అవివేకం జీవితం, అనుభవం, అదే అసలీ లోకంలోకంతకీ ప్రధానమయినది అన్ని కళలూ నశించిపోయినా జీవితం మిగలాలి

రేపు నా పుట్టినరోజు

కారు గౌతమీ గ్రంథాలయం ముందు ఆగింది, రమా, భర్తా, కారు దిగారు అతను ముందు సీట్లో నిద్రపోతున్నాడు. అకారణాశ్రువులు అతని కళ్ళవెంట కారుతున్నాయి రమ అతన్ని మేలుకొలిపింది అతను కళ్ళు నులుపుకుంటూ లేచాడు.

రేపు నా పుట్టినరోజు-రేపు నా షష్టి పూర్తి

[ఆలిండియా రేడియో ప్రసారితం.] ★

---

# పూవు బ్రతుకు

పి.శ్రీదేవి



"ఒకనాటి బ్రతుకుకే ఈ మురిపె మేలనే
ఏనాటి సుకృతమే ఈ నాటి నీ సొగసు!"
"తొలిజన్మలో నేను తలిరు బోణిగ పుట్టి,
మలి జన్మలో నేను మలిచేటి శిల్పినై,
మరియొక్క జన్మలో మురిపించు కవినియై,
తరువాతి జన్మలో తపసినై వెలిశాను.
ఆ సొగసు ఆ జిలుగు ఆ కవిత ఆ తపము
నాలోన వెలసినవి నాలోన విరిసినవి."
"ఇంతచక్కనిదాన వింత సొగసులరాణి
విట్టెవాడితి వేమె! ఇట్టె రాలితి వేమె?"
"వనితనై వలచి వలపించి నిరసించి నానోయీ!
శిల్పినై శిలల దయమాలి బలికివెట్టితినోయీ!
కవినియై నేనె కవినంచు గర్వించినానోయీ!
తపసినై కూడ స్వార్థమునె తలచుకొన్నానోయీ!
ఆ నాటి ఆ ఉసురు ఆ పాపమూ గర్వమూ స్వార్థమె
నన్ను శపించినవోయీ నన్నుసురుపెట్టిన వోయి!"